క్లుప్తంగా

స్వయంపాలన దినోత్సవం



నాగిరెడ్డిపేట: మండలంలోని చీనూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం స్వయంపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలను బోధించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఏగొండ, ఉపాధ్యాయులు శ్రీలత, ప్రసాద్, కిష్టయ్య, నసీమా పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందించాలి



లింగంపేట: నాయీ బ్రాహ్మణుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మహేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన స్థానిక నాయీ బ్రాహ్మణ సంఘ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ క్షౌరశాలలకు ఉచిత విద్యుత్, షాపులు ఏర్పాటు కోసం ఆర్థిక సహాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నందు, జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శి రవీందర్, కోశాధికారి బాబు, ఉపాధ్యక్షుడు బాలకిషన్, పట్టణ అధ్యక్షుడు పోచయ్య, సాయిలు, చంద్రయ్య, నర్సింలు, రాజు పాల్గొన్నారు.

పథకాలు వివరించండి



ఎల్లారెడ్డి: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి వివరించాలని బీజేపీ ఓబీసీ మోర్చా నాయకులు మురళి అన్నారు. ఎల్లారెడ్డి పట్టణంలో నిర్వహించిన బీజేపీ స్ట్రీట్ కార్నర్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలో రావడం ఖాయం అన్నారు. కార్యక్రమంలో నాయకులు దేవేందర్, బాలకిషన్, కౌన్సిలర్ మహేశ్వరి, ప్రశాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

లింగంపేట: మండలంలోని పలు గ్రామాల్లో బీజేపీ నాయకులు ఇంటింటికీ కేంద్రం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. బీజేపీ బలోపేతం చేసేందుకు కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో బూత్ కమిటీ అధ్యక్షుడు నవీన్‌కుమార్, రాజారాం సురేష్, దాసరి అనిల్, నరేష్ పాల్గొన్నారు.

దెబ్బతిన్న తెలంగాణతల్లి విగ్రహం



దోమకొండ: మండలంలోని ముత్యంపేట గ్రామంలో గ్రామ పంచాయతీ ఎదురుగా ఉన్న తెలంగాణ తల్లి విగ్రహం దెబ్బతినింది. విగ్రహం ఎడమ చేయి విరిగి ఉండటాన్ని స్థానికులు గుర్తించి పంచాయతీ పాలకవర్గం దృష్టికి తీసుకెళ్లారు. గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని పేర్కొన్నారు.

గడికోట సందర్శన



దోమకొండ: మండలంలోని గడికోటను మండల కేంద్రమైన బీబీపేట ప్రభుత్వ మున్నూరు కాపువాడ పాఠశాలకు చెందిన విద్యార్థులు మంగళవారం సందర్శించారు. కోట కట్టడం, చరిత్రను పాఠశాల హెచ్ఎం గీతారాణి విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయురాలు సునీత, సీఆర్పీ విమల వారి వెంట ఉన్నారు.

ఫిజియోథెరపితో అంగవైకల్యం దూరం

ఎల్లారెడ్డి: ఫిజియోథెరపితో అంగవైకల్యం దూరం అవుతుందని డాక్టర్ అరుణ్ పేర్కొన్నారు. మంగళవారం భవిత కార్యాలయంలో దివ్యాంగులైన చిన్నారులతో వ్యాయామాలు చేయించారు. కార్యక్రమంలో భవిత సిబ్బంది వెంకటేశం, శివకుమార్ తదితరులు ఉన్నారు.

పీఆర్సీ అమలు చేయాలి



కామారెడ్డి టౌన్: పీఆర్సీని అమలు చేయాలని స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయం ముందు ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలను ధరించి నిరసన వ్యక్తం చేశారు. జేఏసీ నాయకులు బ్రహ్మం, సంపత్‌రెడ్డి, మోహర్‌బాబా పాల్గొన్నారు.

ఆలోచనల కోసమే ప్రదర్శనలు

- సైన్స్ ఎగ్జిబిషన్ విద్యార్థులకు ఎంతో ఉపయోగం
- జాతీయ సైన్స్ దినోత్సవంలో డీఈవో రాజు



కామారెడ్డిలోని ఎస్పీఆర్ పాఠశాలలో..



దేశాయిపేట్‌లో 'సైన్స్' ముగ్గులు వేస్తూ..



సదాశివనగర్ మండలం ధర్మారావ్‌పేట్‌లో సైన్స్ దినోత్సవ వేడుకల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు



భిక్కనూరు మండలం జంగంపల్లి పాఠశాలలో..



లింగంపేట మండలం పొల్కంపేటలో..



గర్గుల్‌లో సైన్స్ ప్రయోగాలను పరిశీలిస్తున్న డీఈవో



కన్నాపూర్‌లో డిజిటల్ తరగతులు ప్రారంభం

కామారెడ్డి రూరల్: విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలు రావడం కోసం ప్రదర్శనలు, పోటీలు ఎంతో ఉపయోగపడుతాయని డీఈవో రాజు పేర్కొన్నారు. అందుకోసమే విద్యార్థులకు సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించినట్లు వెల్లడించారు. భౌతికశాస్త్రంలో సీవీ రామన్ చేసిన అపారమైన సేవలకు గుర్తింపుగా ఆయన గౌరవార్థం ప్రతి ఏటా ఫిబ్రవరి 28న జాతీయసైన్స్ దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే మండలంలోని గర్గుల్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన జాతీయ సైన్స్ దినోత్సవంలో డీఈవో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ చింతల రవితేజగౌడ్, ఎంపీపీ పిప్పిరి ఆంజనేయులు, బీఆర్ఎస్ నాయకులు నిమ్మ మోహన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, కుంబాల రవియాదవ్, ఎస్ఎంసీ చైర్మన్ యేసుస్వామి, జిల్లా సైన్స్ అధికారి ఎం సిద్దిరాంరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు రాజనర్సింహారెడ్డి పాల్గొన్నారు.

కామారెడ్డి అర్బన్: ఆర్ట్స్ అండ్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎం.చంద్రకాంత్, అధ్యాపకులు భౌతిక శాస్త్రవేత్త సీవీ రామన్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. రామన్ ఎఫెక్ట్, విజ్ఞాన శాస్త్ర అభివృద్ధి, మానవాళి మనుగడ అంశాలపై విద్యార్థులకు డాక్యుమెంటరీ ప్రదర్శనతో పాటు డిజిటల్ క్విజ్ నిర్వహించారు.

రాజంపేట: మండల కేంద్రమైన రాజంపేట బాలుర ఉన్నత పాఠశాలలో 70 మంది విద్యార్థులు తయారు చేసిన ప్రయోగాలను ప్రదర్శించారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

భిక్కనూరు: మండలంలోని జంగంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సైన్స్‌మేళా నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన సైన్స్ ప్రయోగాలను స్థానికులు పరిశీలించి అభినందించారు. స్థానిక సిద్దార్థ విద్యాలయంలో శాస్త్రవేత్త సీవీ రామన్ చిత్రపటాన్ని పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులు రంగులతో తీర్చిదిద్దారు.

దోమకొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర, బాలికల పాఠశాలు, సంఘమేశ్వర్ పాఠశాల, అంబారిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కస్తూర్బా పాఠశాలల్లో సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు ప్రదర్శనలు నిర్వహించారు.

లింగంపేట: జాతీయ విజ్ఞాన దినోత్సవంలో భాగంగా డిజిటల్ పాఠ్యాంశాల బోధన పట్ల విద్యార్థుల్లో మరింత ఆసక్తి పెరుగుతోందని ఎంఈవో రామస్వామి పేర్కొన్నారు. కన్నాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఎంఈవో డిజిటల్ తరగతులను ప్రారంభించారు.

సదాశివనగర్: విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకొని ముందుకు సాగాలని హెచ్ఎం మురళి, గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రాధిక సూచించారు. సదాశివనగర్, ధర్మారావ్‌పేట్, మర్కల్‌లో సైన్స్ దినోత్సవ వేడుకలను నిర్వహించారు.

ఎల్లారెడ్డిరూరల్: మున్సిపాలిటీ పరిధిలోని గండిమాసానిపేట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్విజ్ నిర్వహించి గెలుపొందిన వారికి హెచ్ఎం వెంకటరమణ, ఉపాధ్యాయులు దేవేందర్, ప్రకాష్ బహుమతులను అందించారు.

ర్యాగింగ్ భూతాన్ని తరిమికొట్టాలి



ఆందోళ చేస్తున్న డీటీఎఫ్ నాయకులు

కామారెడ్డి అర్బన్: గిరిజన వైద్య విద్యార్థి ప్రీతి నాయక్ మృతికి కారణమైన మహ్మద్ సైఫ్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ డీటీఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ర్యాగింగ్ భూతాన్ని తరిమి కొట్టేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్, దేవులా, బహుజన సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సిద్ధిరాములు తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్: వైద్య విద్యార్థిని ప్రీతి మృతికి కారణమైన సైఫ్‌ను కఠినంగా శిక్షించి, ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి ప్రీతి ఆత్మకు శాంతి కలగాలని మౌనం పాటించారు. కార్యక్రమంలో ఎంఎస్‌యూ రాష్ట్ర నాయకులు బాలు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా వాడకం తగ్గించాలి

నాగిరెడ్డిపేట: వరి పంటకు యూరియా వాడకాన్ని తగ్గించాలని ఎల్లారెడ్డి ఏడీఏ రత్నం సూచించారు. మండలంలోని జప్తిజాన్కంపల్లిలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ యూరియా ఎక్కువ వినియోగిస్తే అగ్గి తెగులు, మెడ విరుపు తెగులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఏవో విజయశేఖర్, ఏఈవో దివ్య పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సురేందర్

ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని మత్తమాల గ్రామంలో ఎమ్మెల్యే సురేందర్ మంగళవారం సిమెంట్ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాలలో సీసీ రోడ్ల కోసం రూ. 1.25 కోట్లు, పంచాయతీ భవనాలకు రూ. 2 కోట్లు, ఆరోగ్య ఉప కేంద్రాల భవనాలకు రూ. 1.28 కోట్లు మత్తమాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మరమ్మతులకు రూ. 17.20 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. సర్పంచ్ అశోక్‌రెడ్డి, ఎంపీపీ మాధవి, జెడ్పీటీసీ ఉషాగౌడ్, మున్సిపల్ చైర్మెన్ సత్యనారాయణ, ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ కాశి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూరు: మండలంలోని కంచర్ల గ్రామంలో సీసీ రోడ్డు పనులను ఎంపీపీ గాలిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ యాదగిరి, ఆత్మ కమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ భగవంత్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ రాపర్తి రాజాగౌడ్ తదతరులు పాల్గొన్నారు.

కామారెడ్డి రూరల్: మండలంలోని గర్గుల్ గ్రామంలో సీసీ రోడ్డు పనులను ఎంపీపీ పిప్పిరి ఆంజనేయులు, సర్పంచ్ చింతల రవితేజగౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చిదుర లక్ష్మారెడ్డి, నిమ్మ మోహన్ రెడ్డి, బొంబొతుల శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు ఎండకుండా చూడాలి



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో బాలకిషన్

రాజంపేట: నర్సరీల్లో పెంచుతున్న మొక్కలు ఎండిపోకుండా చూడాలని ఎంపీడీవో బాలకిషన్ సిబ్బందికి సూచించారు. మంగళవారం మండలంలోని పెద్దాయిపల్లి గ్రామంలోని నర్సరీని ఆయన పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి సోని, ఏపీవో భాస్కర్ టీఏ రాజు ఉన్నారు.

కామారెడ్డి రూరల్: నర్సరీల్లో మొక్కలు పెరిగేలా చూడాలని ఎంపీవో మలహరి అన్నారు. మండలంలోని గర్గుల్ నర్సరీని పరిశీలించారు. ప్రతి నర్సరీలో 10 వేల మొక్కలు పెంచుతున్నట్లు తెలిపారు.

పన్నులు చెల్లించాలి




సమావేశమైన పిట్లం పంచాయతీ సభ్యులు

పిట్లం: పన్నులు సకాలంలో చెల్లించి గ్రామ అభివృద్ధికి సహకరించాలని పిట్లం సర్పంచ్ జొన్న విజయ రెడ్డి కోరారు. స్థానిక పంచాయతీ కార్యలయంలో మంగళవారం సర్పంచ్ అధ్యక్షతన పాలకవర్గ సమావేశం నిర్వహించారు. పంచాయతీ పరధిలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు తీర్మానాలు చేశారు. పంచాయితీ కార్యదర్శి యాదగిరి, ఉప సర్పంచ్ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

నిజాంసాగర్: మండలంలోని గాలీపూర్, ముగ్దుంపూర్, కొమలంచ గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్నుల వసూలుకు పంచాయతీ కార్యదర్శులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు.

ఆధ్యాత్మికం..

- ఘనంగా రేణుక ఎల్లమ్మ ఉత్సవాలు



తలమడ్లలో బోనాలనే ఊరేగిస్తున్న మహిళలు

రాజంపేట: మండలంలోని తలమడ్ల గ్రామంలో శ్రీ రేణుక ఎల్లమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఎల్లమ్మ స్వామికి ఒడిబియ్యం సమర్పించారు. అనంతరం గౌడ సంఘం ఆధ్వర్యంలో మహిళలు బోనాలతో ఆలయం వరకు ఊరేగింపుగా వెళ్లారు.

వైభవంగా కల్యాణం..

కామారెడ్డి రూరల్: మండలంలోని శాబ్దిపూర్ గ్రామంలో శ్రీ రేణుకా జమదగ్నిల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పుట్ట మన్ను తెచ్చి అనంతరం బోనాల ఊరేగింపు చేపట్టారు. కల్యాణోత్సవానికి బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎంజీ వేణుగోపాల్ గౌడ్‌తో పాటు పలువురు హాజరయ్యారు.

అధికారులు అందుబాటులో ఉండాలి

- మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల తీర్మానం
- కుక్క కాటుకు ఆస్పత్రుల్లో మందులు ఉంచాలని సభ్యుల డిమాండ్



అధికారిని ప్రశ్నిస్తున్న జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీ

దోమకొండ: అధికారులు అందుబాటులో ఉండాలని మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు తీర్మానం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ కానుగంటి శారద అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం వాడివేడిగా జరిగింది. మండలానికి చెందిన పలువురు అధికారులు అందుబాటులో ఉండటం లేదని, విధులు సరిగా నిర్వహించడం లేదని సభ్యులు మండిపడ్డారు. ఇరిగేషన్ అధికారుల తీరుపై జెడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, వైస్ ఎంపీపీ బాపురెడ్డి, ఎంపీటీసీ సభ్యులు ఫిరంగి రాజేశ్వర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ నీరు లీకేజీలు గుర్తించి మరమ్మతులు చేయించాలన్నారు. పశువైద్యాధికారులు అందుబాటులో ఉండాలని, ఉపాధ్యాయులు సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కుక్కకాటు మందులు అందుబాటులో ఉండేలా చూడాలని వైద్య సిబ్బందికి సూచించారు. లింగుపల్లిలో కంటి వెలుగు పరీక్షలు నిర్వహించి అద్దాలు ఇవ్వలేదని సర్పంచ్ సాయిలు సభ దృష్టికి తీసుకువచ్చారు. అంగన్‌వాడి సెంటర్‌లకు గత రెండు నెలలుగా పాల సరఫరా కావడం లేదన్నారు. యూరియా విక్రయాల్లో పారదర్శకత ఉండాలన్నారు. సంఘమేశ్వర్ గ్రామంలో ఇళ్లపై నుంచి విద్యుత్ తీగల ఉన్నాయని వాటిని తొలగించాలని కోరారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ బాపురెడ్డి, ఎంపీడీవో చిన్నారెడ్డి, తహసీల్దార్ కౌశిక, సింగిల్ విండో చైర్మన్ పన్యాల నాగరాజ్‌రెడ్డి, రైతుబంధు మండల అధ్యక్షుడు నర్సారెడ్డి, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్‌పై చర్యలు తీసుకోవాలి



కామారెడ్డి టౌన్: సామాన్యులను ఇబ్బందులకు గురి చేస్తున్న స్థానిక సబ్ రిజిస్ట్రార్‌పై చర్యలు తీసుకోవాలని కామారెడ్డి డెవలపర్స్, బిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని ఏవోకు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సబ్ రిజిస్ట్రార్ దస్తావేజు లేకరులను ఏజెంట్లుగా నియమించుకుని వారి ద్వారా అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి లద్దూరి లక్ష్మిపతి యాదవ్, రమేష్‌గుప్తా, భూమేష్ యాదవ్, రవీందర్, రాజిరెడ్డి, హన్మంత్‌యాదవ్, నిట్టు నారాయణ రావు, గంజి శ్రీనివాస్, తాజోద్దీన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వేధింపులు వద్దు..

కామారెడ్డి సబ్ రిజిస్ట్రార్‌పై రియల్ ఎస్టేట్ వ్యాపారుల వేధింపులు మానుకోవాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ప్రకాష్‌నాయక్ డిమాండ్ చేశారు. గిరిజన కులానికి చెందిన అధికారిపై తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు జబ్బర్‌లాల్, రాజు, పూల్‌సింగ్ పాల్గొన్నారు.

తడి పొడి సాగుపై అవగాహన

మచారెడ్డి: మండలంలోని లచ్చాపేటలో పద్మ పాని స్వచ్ఛంద సంస్థ, కోర్ కార్బన్ ఎక్స్ సొల్యూషన్ సహకారంతో రైతులకు వరిలో తడి పొడి విధానంపై అవగాహన కల్పించారు. ఆ సంస్థ మండల కోఆర్డినేటర్ దేవరాజ్, ఏఈవో రాజేశ్, ఎంపీటీసీ బూస శ్రీనివాస్, రైతుబంవధు కో ఆర్డినేటర్ బాలరాజు, వీడీసీ చైర్మెన్ దేవేందర్ పాల్గొన్నారు.

దర్జీలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలి



ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న మేరు సంఘం నేతలు

బాన్సువాడ టౌన్: మేరు కులవృత్తిపై ఆధారపడి జీవిస్తున్న దర్జీలకు ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ ఆ సంఘం నేతలు మంగళవారం ఆర్డీవో రాజాగౌడ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మేరు సంఘం అధ్యక్షుడు దేవదాస్ మాట్లాడుతూ మేరు కులాన్ని బీసీ–డి నుంచి బీసీ–ఏ లోకి మార్చాలని, మేరు ఫెడరేషన్ ఏర్పాటు చేసి కుట్టు మిషన్లు ఉచితంగా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మేరు సంఘం నేతలు జీవన్, మహేష్, హన్మండ్లు, లింగం, శ్రీనివాస్, యాదవ్, శ్రీకాంత్, మహేష్, గంగాధర్, అంజనేయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను గెలిపించండి



పిట్లం: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని మాజీ ఎమ్మెల్యే గంగారం పేర్కొన్నారు. మండలంలోని తిమ్మనగర్‌లో మంగళవారం నిర్వహించిన హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో ప్రభుత్వ సంస్థలను ఏర్పాటు చేసి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తే, బీజేపీ ప్రభుత్వం ఆ సంస్థలను ప్రైవేటీకరిస్తూ నిరుద్యోగును మోసం చేస్తోందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గోపాల్ రెడ్డి, నాయకులు హన్మండ్లు, అరవింద్, షేక్ నజీర్, ప్రవీణ్, శ్రీధర్ రెడ్డి, రవి, మోయిన్, తుకారం, బాల్‌రాజ్, రాజు, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడను జిల్లాగా ప్రకటించాలి

బాన్సువాడ టౌన్: బాన్సువాడను జిల్లా కేంద్రంగా ప్రకటించాలని సీఎం కేసీఆర్‌కు విన్నవిస్తామని కాంగ్రెస్ నియోజకవర్గం ఇంచార్జి కాసుల బాల్‌రాజ్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో ప్లకార్డులను ప్రదర్శించారు. బాన్సువాడను జిల్లాగా ప్రకటించాలని 108 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేశామని గుర్తు చేశారు. నాయకులు ఖలేక్, మంత్రి గణేష్, మాసాని శేఖర్ రెడ్డి, హన్మండ్లు, గుడాల నగేష్, అజీం, బిట్ల సురేందర్, గంగాధర్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ నేతల ముందుస్తు అరెస్ట్

నిజాంసాగర్: తెలంగాణ తిరుపతి దేవస్థాన బ్రహ్మోత్సవాలకు సీఎం కేసీఆర్ హాజరవుతున్న నేపథ్యంలో ఆందోళనలు చేస్తారనే అనుమానంతో బీజేపీ నేతలను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సీఎం పర్యటన ముగిసే వరకు వారిని స్టేషన్‌లోనే ఉంచుతామని పోలీసులు తెలిపారు.

బాన్సువాడ టౌన్: బీజేపీకి చెందిన పలువురు నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి నిజాంసాగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో సమావేశమైన నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కొత్తకొండ భాస్కర్, నాయకులు చీదరి సాయిలు, కోనాల గంగారెడ్డి, శ్రీనివాస్, పైడిమల్ లక్ష్మీనారాయణ, సాయిబాబా, రాజేశ్వర్‌రెడ్డి, శంకర్‌గౌడ్‌ను స్టేషన్‌కు తరలించారు.

సంక్షిప్తం

మాచారెడ్డికి చేరిన మహాపాదయాత్ర

మాచారెడ్డి: ఆది జగద్గురు రేణుకా చార్య చేపట్టిన మహాపాదయాత్ర మంగళవారం మాచారెడ్డికి చేరుకుంది. పాదయాత్ర పర్యవేక్షకుడు నాగ భూషణ స్వామి మాట్లాడుతూ గత నెల 21న గాంధారి మండలం గుడిమెట్ నుంచి ప్రారంభమైన యాత్ర 4న జనగామ జిల్లా కొలనుపాక పుణ్యక్షేత్రానికి చేరుకుంటుందని తెలిపారు.

3న మామిడి, చింతచెట్ల వేలం

నాగిరెడ్డిపేట: మండలంలోని మాల్తుమ్మె విత్తనక్షేత్రంలో ఉన్న మామిడి, చింత చెట్లను 3వ తేదీ వేలం పాట నిర్వహించనున్నట్లు ఏడీఏ వీరాస్వామి తెలిపారు. ఆసక్తి ఉన్న వ్యాపారులు వేలం పాటలో పాల్గొనాలని సూచించారు.

అనుమతుల్లేకుండా ఇసుక రవాణా

మద్నూర్: అనుమతుల్లేకుండా వందల లారీలు, టిప్పర్లతో ఇతర రాష్ట్రాలకు ఇసుక తరలిస్తున్నా పట్టించుకోని అధికారులు ఇళ్ల నిర్మాణానికి ఇసుక తీసుకెళ్తున్న ట్రాక్టర్ల యజమానులను అధికారులు వేధిస్తున్నారని బీఎస్పీ మండల అధ్యక్షుడు రాములు ఆరోపించారు.

గ్రామాభివృద్ధికి కృషి

సదాశివనగర్: మండలంలోని తుక్కోజివాడి గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే జాజాల సురేందర్ హామీ ఇచ్చినట్లు ఉప సర్పంచ్ సంగారావు వెల్లడించారు.

అమెరికా నుంచి ఎమ్మెల్యే తిరుగు పయనం

భిక్కనూరు: వ్యక్తిగత పనుల నిమిత్తం 21 రోజుల పాటు అమెరికా పర్యటనకు వెళ్లిన కామారెడ్డి ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అక్కడి నుంచి తిరుగు పయనం అన్నారు. ఎన్ఆర్ఐలు ఎమ్మెల్యేకి ఘనంగా వీడ్కోలు పలికారు.

బోరు మోటార్ ప్రారంభం

నిజాంసాగర్: మండలంలోని తున్కిపల్లి గ్రామ పంచాయతీలో బోరు మోటార్‌ను బీఆర్ఎస్, జాగృతి నాయకులు అమీర్, అంబయ్య తదితరులు ప్రారంభించారు.

సేవలు అభినందనీయం

రాజంపేట: మండల విస్తరణాధికారిగా జ్యోత్స్న ప్రియదర్శిని రైతులకు అందించిన సేవలు అభినందనీయం అని ఏడీఏ అపర్ణ అన్నారు. ఆమె బదిలీపై వెళ్తున్న సందర్భంగా డివిజన్ పరిధిలో పని చేస్తున్న సిబ్బంది వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి సత్కరించారు. ఏవోలు అపర్ణ, పవన్, రాధ, కిషన్, రాజు, అనిల్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలి

పిట్లం: విద్యార్థులను పరీక్షల సన్నద్ధం చేయాలని ఎంఈవో దేవీసింగ్ సూచించారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో మండల స్థాయి నెలవారి ఎఫ్ఎల్ఎన్ రివ్యూ సమావేశం నిర్వహించారు. అభ్యసన ఫలితాలను పెంచాలని నోడల్ అధికారి విఠల్ పేర్కొన్నారు.

విధుల్లో చేరిన ఎంపీడీవో

సదాశివనగర్: వ్యక్తిగత సెలవుపై వెళ్లిన ఎంపీడీవో కొండ లక్ష్మి తిరిగి మంగళవారం విధుల్లో చేరారు. ఇన్‌చార్జి ఎంపీడీవో సురేందర్‌రెడ్డి నుంచి బాధ్యతలు తీసుకున్నారు.

వరి పంట పరిశీలన

నిజాంసాగర్: మండలంలోని వెల్గనూర్‌లోని వరి పంట పొలాలను క్లస్టర్ ఏఈవో రేణుక పరిశీలించారు. అగ్గి తెగులు, మొగి పురుగు నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి రైతులకు వివరించారు. సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు రమేష్‌గౌడ్, నాయకులు ఆనంద్‌కుమార్, సంగయ్య తదితరులు ఉన్నారు.